క్లుప్తంగా

కేంద్రమంత్రికి ఘన స్వాగతం



కేంద్రమంత్రి ఎస్పీ సింగ్ బఘేల్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

మధురపూడి: జిల్లా పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్‌కు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఇండిగో విమానయాన సర్వీసులో వచ్చిన ఆయనకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర నాయకులు రేలంగి శ్రీదేవి, కోడూరి లక్ష్మీనారాయణ, పరమి రాధా, నీరుకొండ వీరన్నచౌదరి తదితరులు స్వాగతం పలికారు. ఆయన ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గం మీదుగా రాజమహేంద్రవరం వెళ్లారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

సీతానగరం: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముగ్గళ్ల శాఖ ఆధ్వర్యంలో, నాబార్డు సౌజన్యంతో మంగళవారం వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విభూతి బ్రదర్స్ మ్యాజిక్ షో, పాటలు, జానపద గీతాలు ఆలపించారు. జీరో బ్యాలెన్స్ ఖాతాలు, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి పథకం, ప్రధానమంత్రి సురక్ష అటల్ పెన్షన్ యోజన, జనరల్ ఇన్సూరెన్స్, సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తలు, పీఎం విశ్వకర్మపై కళాజాత నిర్వహించారు.

పాస్టర్ల ఫెలోషిప్ నూతన కార్యవర్గం

రంగంపేట: మండల పాస్టర్ల సంక్షేమ సంఘ సమావేశం మంగళవారం వడిశలేరు గ్రామంలో జరిగింది. ఈ సమావేశంలో 2024 సంవత్సరానికి ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా సీహెచ్ సామ్యూల్ సుదర్శన్, అధ్యక్షుడిగా మోర్త జ్యోతిబాబు, ఉపాధ్యక్షుడిగా ప్రసన్నకుమార్, గౌరవాధ్యక్షుడిగా గిద్యో, సెక్రటరీగా నీరుమల్లి ఒనేసేమా కుమార్, ట్రెజరర్‌గా మందపల్లి చిట్టిబాబు, ఎన్నికయ్యారు.

ఆటో కార్మికుల శాంతి నిరసన



గోకవరంలో నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

గోకవరం: తెలంగాణ మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తారన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆటో కార్మికులు మంగళవారం గోకవరం మండలంలో ఆటో సర్వీసులు నిలిపివేసి శాంతియుతంగా నిరసన తెలిపారు. గోకవరం శివారున శివాలయం నుంచి మొదలుకొని ప్రధాన రహదారి మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం పెట్టి తమ పొట్ట కొట్టవద్దని నినాదాలు చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఆటో కార్మికులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగితీగ చోరీ

రంగంపేట: వ్యవసాయ బోరుకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగితీగ చోరీ అయినట్టు బాధితుడు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం ప్రకారం.. నల్లమిల్లి గ్రామానికి చెందిన నెల్లి అర్జునకు గ్రామంలో ఐదు ఎకరాల మెట్ట పొలం ఉంది. సాగునీటి కోసం బోర్ వేయించి, ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేశారు. సోమవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి, దొంగలు రాగితీగను పట్టుకుపోయారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మేథ్స్ ఒలింపియాడ్‌లో విజయభేరి



ప్రతిభ చూపిన శ్రీమహతి హైస్కూల్ విద్యార్థులు

సీతానగరం: కాటవరంలో శ్రీమహతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ఇంటర్నేషనల్ మేథ్స్ ఒలింపియాడ్ పరీక్షలలో రీజినల్, జోనల్ స్థాయిలో బంగారు పతకాలు సాధించారని హైస్కూల్ కరస్పాండెంట్ ఎ.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. న్యూఢిల్లీకి చెందిన సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ నిర్వహించిన ఈ ప్రతిభా పరీక్షల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకూ మొత్తం రీజినల్, ఇంటర్నేషనల్ గోల్డ్ మెడల్స్ 62 సాధించారని, 38 మంది విద్యార్థులు లెవెల్ -2కు ఎంపికయ్యారని, నలుగురు బహుమతులు, నగదు పొందారన్నారు. అలాగే ఇంటర్నేషనల్ బెస్ట్ 2వ ర్యాంక్‌ను నలుగురు విద్యార్థులు సాధించారన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకాలు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి భారీగా అభిషేకాలు నిర్వహించారు. మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు.

వరి కుప్పలు.. రక్షణ ఛత్రాలు

- మంచి ధర ఉన్నప్పుడు అమ్ముకునే అవకాశం
- మెట్టలో కొనసాగుతున్న విధానం



వరి పంటను పొలంలోనే కుప్పలుగా వేస్తున్న దృశ్యం (ఫైల్)

రాజానగరం: ఆరుగాలం శ్రమించి పండించిన పంటను మంచి ధరకు అమ్ముకోవాలని ప్రతి రైతూ భావిస్తాడు. పంట కోతకు వచ్చిన సమయంలో ఆశించిన ధర లేకుంటే అవకాశం ఉన్న రైతులు ఆ పంటను గిడ్డంగులలో నిల్వ చేసుకుని, మంచి ధర వచ్చినప్పుడు విక్రయించి సొమ్ములు చేసుకుంటారు. అయితే వరి పంట విషయంలో ఇటువంటి అవకాశాలు లేకపోవడంతో పూర్వకాలం నుంచి గ్రామాలలో మోతుబరి రైతులు గాదెలు ఏర్పాటు చేసుకుని, వాటిలో పండిన ధాన్యాం నిల్వచేసేవారు. కానీ ఇది అందరికీ సాధ్యం కాదు కాబట్టి, చాలామంది గాదెలకు ప్రత్యామ్నాయంగా పొలాల్లోనే వరి పంటను కుప్పగా పేర్చి, మార్కెట్‌లో ధర ఉన్నప్పుడు ఆ వరి పంటను నూర్చి, ధాన్యాన్ని విక్రయిస్తుంటారు.

మెట్ట ప్రాంతంలో..

మెట్ట ప్రాంతంలో ఖరీఫ్ వరి సాగు తుపానుల ప్రభావంతో కొంత మేరకు నష్టం కలిగినా గానీ, ముందస్తు కోతలు చేపట్టినచోట చాలా వరకూ ఆశాజనకంగానే సాగింది. పక్వానికి వచ్చిన వరి పంటను యంత్రాలతో కోయించి, పొలాల నుంచి విక్రయాలు సాగించే క్రమంలో కొందరు రైతులు పండిన పంటను నిల్వ చేసి, అనుకున్న ధర వచ్చినప్పుడు అమ్ముకునేందుకు వరి కుప్పలు వేశారు. యంత్రాలతో కోసిన వరి పంటకు ఈ అవకాశం ఉండదు. కూలీలతో కోసిన వరి పనలను పొలాల్లోనే ఆరబెట్టి, ఆపై వాటిని అదే ప్రాంతంలో కుప్పగా పేరుస్తారు. త్రికోణం ఆకారంలో వేసే ఈ వరి కుప్పల వలన ఎంతటి వర్షాలు కురిసినా అందులో ధాన్యానికి ఎటువంటి నష్టం ఉండదు. ఈ విధంగా నిల్వ చేసిన ధాన్యాన్ని తమ ఆహార అవసరాలకు వాడుకునేందుకు శ్రేష్ఠంగా ఉంటుందంటున్నారు రైతులు. ఒకవేళ ఆ విధంగా చేయకపోయినా గిట్టుబాటు ధర ఎప్పుడు వస్తే అప్పుడు విక్రయించి, మంచి లాభాలు పొందవచ్చంటున్నారు. ఇందుకుగాను పొలాలలోనే వరి కుప్పలు వేసి, నిల్వలు చేస్తున్నారు.

సంప్రదాయాలకు ప్రతీక

మన సంప్రదాయాలకు ఈ వరి కుప్పలు కూడా ఒక ప్రతీకగా నిలుస్తాయని సీనియర్ రైతులు అంటున్నారు. సాధారణంగా సంక్రాంతి పండగ సమయంలో పొలాల నుంచి పంటలను ఇళ్లకు చేరుస్తుండేవారు. పూర్వం సాగునీటి సదుపాయాలు పెద్దగా లేకపోవడంతో ఏడాదిలో ఒక పంటగా వరిని, రెండో పంటగా అపరాలు సాగు చేసేవారు. ఈ కారణంగా మొదటి పంటగా సాగు చేసిన వరిని కోతల తర్వాత కుప్పలు వేసి, అదే పొలంలో అపరాలను రెండో పంటగా సాగు చేసేవారు. అపరాలు కోతకు వచ్చాక వరి కుప్పలను కూడా నూర్పిడులు చేసి, రెండు పంటలను ఇళ్లకు తెచ్చుకునేవారు. ఆ సమయంలోనే సంక్రాంతి పండగ రావడం, ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో గడపడం జరిగేదంటున్నారు. ఈ సంప్రదాయం కొన్ని ప్రాంతాలలో (ఒకే పంట పండే ప్రాంతాలలో) ఇప్పటికీ కొనసాగుతుంది.

యంత్రాలతో కోస్తే కుప్పలు వేయలేరు

యంత్రాలతో కోసిన వరి పంటను ఈ విధంగా కుప్పలు వేయడం సాధ్యం కాదు. ఎందుకంటే యంత్రాలతో కోతలు కోయడం వలన నేరుగా ధాన్యం వస్తుంది గానీ వరి పనలుగా రాదు. ఈ కారణంగా యంత్రాలతో కోతలు కోసిన ధాన్యాన్ని బాగా ఆరబెట్టి, ఆపై బస్తాలకు ఎక్కించి, కావాలనుకుంటే నిల్వ చేసుకోవచ్చు. కానీ ఈ విధంగా ప్రకృతి ఒడిలో నిల్వ చేయడం సాధ్యపడని విషయంగా రైతులు పేర్కొంటున్నారు. అంతేకాక సాధారణంగా యంత్రాలతో వరి కోతలు చేయడం వలన పొలాల నుంచి నేరుగా విక్రయాలు సాగించడానికి ఎక్కువ అవకాశం ఉండటంతోపాటు కూలీ ఖర్చులను కూడా తగ్గించుకోవచ్చంటున్నారు.

ధాన్యం గింజలు గట్టిపడతాయి



వరి కుప్పలు వేయడం వలన ధాన్యం గింజలలో పచ్చిదనం పోయి, గట్టిపడటంతోపాటు ముదురు రంగులోకి వస్తాయి. ఇది ఆహారానికి ఆరోగ్యకరంగా ఉంటుంది. ఇలా చేయడం వలన ధాన్యం ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. అయితే ఆధునిక సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో వ్యవసాయంలో కూడా హడావుడి పెరిగిపోయి, త్వరగా దిగుబడులు రావాలని, అంతే త్వరగా పంటలను విక్రయించాలని రైతులు చూస్తున్నారు. – దేవలంక శ్రీరామ్మూర్తి, నరేంద్రపురం

ఆ విధానం ఎంతో మంచిది



ఆధునిక కాలంలో వరి కుప్పలు వేయడం ఎక్కడా కనిపించడం లేదు. ఇది సాధారణంగా ఒకే పంటగా వరిని పండించే ప్రాంతాలలో చేస్తుంటారు. సంప్రదాయకంగానే కాకుండా ఆహార పరంగా కూడా వరి పంటను కుప్పలు వేసి, కొంతకాలం నిల్వలు చేయడం మంచిదని మన పూర్వీకులు ఈ విధాన్ని ప్రవేశపెట్టారు.
– గంగిశెట్టి సోమేశ్వరరావు, పాలచర్ల

పారదర్శకంగా తుది జాబితా

అనపర్తి నియోజకవర్గ ఓటర్లు 2,23,255

అనపర్తి: అనపర్తి నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను తహసీల్దార్ వై సరస్వతి విడుదల చేశారు. ఈ ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 2024 సంవత్సరానికి గాను ఓటర్ల తుది జాబితాను పారదర్శకంగా రూపొందించినట్టు తెలిపారు. నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, పెదపూడి మండలాల్లో పురుషుల కంటే, మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. అనపర్తి మండలంలో అత్యధికంగా 30,724 మంది మహిళా ఓటర్లు ఉండగా, రంగంపేట మండలంలో అత్యల్పంగా 23,731 మంది నమోదయ్యారు. నియోజకవర్గంలో మొత్తం 2,23,255 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 1,13,930 మంది మహిళలు, 1,09,323 మంది పురుషులు ఉన్నారు. అనపర్తి మండలంలో మహిళలు 30,724, పురుషులు 28,445, బిక్కవోలు మండలంలో మహిళలు 29,571, పురుషులు 27,680, రంగంపేట మండలంలో మహిళలు 23,731, పురుషులు 23,734, పెదపూడి మండలంలో మహిళలు 29,904, పురుషులు 29,464 నమోదయ్యారు. ఇదిలావుండగా నాలుగు మండలాల పరిధిలో మొత్తం 2,566 మంది దివ్యాంగ ఓటర్లు, 60 ఏళ్ల దాటిన ఓటర్లు 36,367 మంది, 80 ఏళ్ల దాటిన ఓటర్లు 2,927 మంది ఉన్నట్టు తుది జాబితాలో పేర్కొన్నారు.

దైవాన్ని స్మరించుకుంటూ జీవించాలి



కోటపాడులో కార్యక్రమానికి హాజరైన భక్తులు

రంగంపేట: కోటపాడు గ్రామానికి సత్యసాయిబాబా విచ్చేసి 55 ఏళ్ల పూర్తయిన సందర్భంగా స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ చైతన్య కళాశాల సంస్కృత ఉపన్యాసకుడు కందర్ప రాంబాబు మాట్లాడుతూ దైవ నామస్మరణతో ఐక్యమత్యంగా జీవితాలు గడపాలన్నారు. సమాజ సేవలో భాగస్వాములు కావాలన్న బాబా సూక్తిని ఆచరించడానికి నిరంతర సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా మహానగర సంకీర్తన నిర్వహించారు. కోలాటం, వేద మంత్రోచ్ఛరణ, నామ సంకీర్తనలతో గ్రామమంతా ఊరేగారు. సీతారాముడు, లక్ష్మణుడు, హనుమంతుడి వేషధారణలతో విద్యార్థులు అలరించారు. సత్యసాయి సంస్థల ప్రతినిధులు మలిరెడ్డి వీర్రాజు, కందర్ప వెంకట అమర్నాథ్, కందర్ప సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు రక్ష



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

బిక్కవోలు: రాష్ట్రంలో నిర్వహిస్తున్న రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిరుపేదల ఆరోగ్యానికి రక్షణ కల్పిస్తున్నాయని సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం పందలపాక సచివాలయం-1 వద్ద జగనన్న సురక్ష 2.0 వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి ప్రభుత్వం కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తోందన్నారు. మొత్తం 543 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు పీహెచ్‌సీ వైద్యురాలు విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మచ్చాపాప, మాజీ జెడ్పీటీసీ కిలపర్తి సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్ పడాల వీర్రాఘవరెడ్డి, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం ఛైర్మన్ గండివాసు, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యుడు యాసలపు శ్రీనివాస్, సచివాలయ కన్వీనర్ కర్రి సతీష్, వైఎస్సార్ సీపీ నాయకులు గొలుగూరి నాగిరెడ్డి, గొలుగూరి మల్లిబాబు, రొంగల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శం



శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సర్పంచ్ చినబాబు

పెదపూడి: గ్రామీణ పేదలకు నాణ్యమైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎంపీడీఓ వీవీ సాయిబాబు అన్నారు. రామేశ్వరం గ్రామంలో స్థానిక సర్పంచ్, సర్పంచ్‌ల సమాఖ్య నియోజకవర్గ అధ్యక్షుడు కొటికలపూడి చినబాబు అధ్యక్షతన గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. చినబాబు మాట్లాడుతూ పేద ప్రజల వద్దకు వెళ్లి వైద్యం అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. శిబిరంలో వైద్య నిపుణురాలు ప్రత్యూష 210 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ గంగుమళ్ల సుబ్రహ్మణ్యం, ఉప సర్పంచ్ దుళ్ల వీరవెంకట సత్యనారాయణ, సచివాలయ కార్యదర్శి అచ్చిరాజు, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ ప్రతినిధి కాద వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సహకారంతో చదువులో రాణించాలి



పంపిణీ చేసిన ట్యాబ్‌లతో విద్యార్థులు

రంగంపేట: చదువులో రాణించడానికి ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను విద్యార్థులు సక్రమంగా వినియోగించుకోవాలని జెడ్పీటీసీ పి.రాంబాబు అన్నారు. వెంకటాపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్ఎం గంగరాజు ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ రాంబాబు మాట్లాడుతూ ఒక్కో ట్యాబ్ రూ.32 వేల విలువైందన్నారు. విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్ ముంగి గంగరాజు, వైఎస్సార్ సీపీ కన్వీనర్ మాగాపు వెంకటరమణ, జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షుడు మంగిన రాంబాబు, విద్యా కమిటీ ఛైర్మన్ ముంగి చంద్రశేఖర్, వైస్ ఛైర్మన్ కన్నాబత్తుల లక్ష్మి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు.

సీఎం జగన్‌తోనే బీసీల అభ్యున్నతి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- వైఎస్సార్ సీపీలో నాయీ బ్రాహ్మణుల చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: మండలంలో నాయీ బ్రాహ్మణులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని, జగనన్నతోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. రాపాకలోని పిచ్చుకుల విజయ్ లేఅవుట్‌లో నాయీ బ్రాహ్మణుల కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కేటాయించిన నాలుగు సెంట్లు భూమి ప్రతాలను మంగళవారం నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం సభ్యులకు ఆయన అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ప్రభుత్వం నుంచి గ్రాంటు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. 2014 ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీలు కలిసి 650 హామీలు ఇచ్చి అధికారంలోకి రావడం జరిగిందని, అందులో పది శాతం హామీలను కూడా అమలుపర్చలేదన్నారు. నేడు మన ప్రభుత్వంలో బీసీల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. బీసీలు అంటే వెనుకబడిన తరగతులు కాదని, మన సమాజానికి, రాష్ట్రానికి, దేశానికి వెన్నెముక లాంటివారని నిరూపించి, వారికి అన్ని విధాలుగా చేయూత అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 65 శాతానికి పైబడి బీసీ, ఎస్సీ, మైనార్టీలకు రాష్ట్ర క్యాబినెట్ మంత్రులుగా ముఖ్యమంత్రి జగన్ అవకాశం కల్పించారని, 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారి అభ్యున్నతికి కృషి చేశారన్నారు. అనంతరం కమ్యూనిటీ హాలు నిర్మాణానికి స్థలం అందించిన పిచ్చుకుల విజయ్ కుమార్‌ను సన్మానించారు. అనంతరం నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 50 మంది సభ్యులు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి హరిబాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, నియోజకవర్గం బూత్ కమిటీల ఛైర్మన్ గద్దె వెంకటకృష్ణ చౌదరి, మండల ఆర్బీకే ఛైర్మన్ వలవల వెంకట్రాజు, ఏపుగంటి సత్తిబాబు, నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు సుందరపల్లి నరేష్ పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపు ఖాయం

- జగన్ పాలనకు ప్రజలందరి మద్దతు
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: ప్రతిపక్ష పార్టీలు ఎన్ని పొత్తులు పెట్టుకున్నా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చామని, ప్రజలు మద్దతు పార్టీకి పుష్కలంగా ఉందన్నారు. సీతానగరంలోని జీవీకే కన్వెన్షన్ హాలులో పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి గ్రామాలకు చెందిన నాయకులతో మంగళవారం ఆయన సమావేశమై పలు అంశాలను సుదీర్ఘంగా చర్చించారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో విజయం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని సూచించారు. పెత్తందారులకు పేదవారికీ జరుగుతున్న ఈ ఎన్నికల సమరంలో చంద్రబాబు నాయుడు పెత్తందారుల వైపు ఉంటే.. జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షాల ఉన్నారన్నారు. పేదలందరికీ ఆర్థిక భరోసా కల్పిస్తూ అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వం మనదన్నారు. గత ఎన్నికలలో మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని జగనన్న అమలు చేసి నిరూపించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు డాక్టర్ బాబు, మండల ఆర్బీకే ఛైర్మన్ వలవల వెంకట్రాజు, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, గద్దె వెంకటకృష్ణ చౌదరి, అంబటి రాజు, మద్దాల కొండలరావు, గద్దె వీరన్నబాబు, సత్యం రాంపండు పాల్గొన్నారు.

ఉద్యానవన పంటలపై సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న విద్యార్థులు

గోకవరం: ఉద్యానవన పంటలపై డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ విద్యార్థులు మంగళవారం రైతు సదస్సు నిర్వహించారు. మండలంలోని వీరలంకపల్లి శివారున రామకృష్ణా గార్డెన్స్‌లో కృషి విజ్ఞాన కేంద్రం, పందిరి మామిడి ధ్యాన పరిశోధన స్థానం సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న వివిధ విశ్వవిద్యాలయాల డాక్టర్ బి.ప్రసన్నకుమార్, డాక్టర్ ఏవీడీ దొరాజీరావు, కోరుకొండ హార్టికల్చర్ అధికారిని పాల్గొని రైతులకు మామిడిలో పూత మాడడం, పిందె రాలడం వంటి సమస్యలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. పలు రకాల పండ్ల సాగు, సస్యరక్షణ గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ కె.రాజేంద్రప్రసాఆద్, ఆదర్శ రైతు కొరిపల్లి అప్పలస్వామి, రైతులు పాల్గొన్నారు.

గైట్ ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ

రాజానగరం: మహారాష్ట్రలోని నాసిక్‌లో కేంద్ర యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి 17 వరకూ జరిగిన 27వ జాతీయ యువజనోత్సవాలలో గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు షెకీనా గిడెయోనోక్, డి.వరప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ అడ్వెంచర్ రాక్ క్లైంబింగ్‌లో ప్రతిభ కనబరిచిరని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. ధనరాజ్ తెలిపారు. అక్కడకు వచ్చిన యువతకు మన ఆత్రేయపురం పూతరేకుల రుచి చూపించడంతో పాటు వివిధ రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకున్నారన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు

ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ



వినియోగదారుల అర్జీలు స్వీకరిస్తున్న డాక్టర్ సత్యనారాయణ

అనపర్తి: రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. మంగళవారం మండలంలోని దుప్పలపూడిలో ఉన్న విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయ ప్రాంగణంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వినియోగదారుల గ్రీవెన్స్ ఫోరం ఛైర్‌పర్సన్, విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ పాల్గొన్నారు. విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారానికి ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ప్రత్యేకంగా రూపొందించిన సీజీఆర్ఎఫ్ పేరుతో యాప్‌ను అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. ఫిర్యాదులను ఈ యాప్‌లో నమోదు చేయవచ్చని సూచించారు. నిర్ణీత కాల పరిమితి లోగా సమస్యలు పరిష్కారం కాకపోతే, ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేస్తే తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు స్థానిక జీబీఆర్ విద్యాసంస్థల సెమినార్ హాలులో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు వి.జనార్ధన్‌రావు, డాక్టర్ ఆర్ సురేంద్రకుమార్, ఈఈ టెక్నికల్ పి.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన అంగన్‌వాడీ సిబ్బంది



రాజానగరంలో జాయినింగ్ రిపోర్టులు రాస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

రాజానగరం: తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం తీసుకున్న శ్రద్ధకు అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుమారు నెల రోజులుగా ఆందోళన బాట పట్టిన వీరితో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలం కావడంతో మంగళవారం నుంచి విధులలో చేరారు. ఈ మేరకు ప్రాజెక్టు సీడీపీఓకు తమ జాయినింగ్ రిపోర్టులు ఇచ్చేందుకు స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి రాజానగరం, కడియం, రాజమహేంద్రవరం రూరల్ మండలాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది భారీగా తరలివచ్చారు. అంగన్‌వాడీల యూనియన్ అధ్యక్షులు ఎం.మార్తమ్మ, సెక్టార్ కార్యదర్శులు విజయ, యు.విశాలి, ఎం.మాధురి, చంద్రవతి మాట్లాడుతూ ఆందోళనలను విరమించి, అంగన్‌వాడీ కేంద్రాలలో అంతా విధులలో చేరామన్నారు. తమ సమస్యలను అర్థం చేసుకుని, సహృదయంతో చొరవ తీసుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి బొత్స సత్యనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు.

సారా బట్టీ ధ్వంసం

సీతానగరం: చీపురపల్లి పంచాయతీ పరిధి అచ్చయ్యపాలెం శివారు కొండ ప్రాంతంలోని సారా బట్టీపై దాడి చేసి, సంసాని నానీని అరెస్ట్ చేశామని ఎస్సై టి.రామకృష్ణ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని, 65 లీటర్ల సారా, మోటారు సైకిల్, రెండు అల్యూమినియం గిన్నెలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు తెలిపారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



కణుపూరు హైస్కూల్లో విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



గోకవరంలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసిన వీరబాబు తదితరులు

మధురపూడి: కోరుకొండ మండలం కణుపూరు హైస్కూల్లో విద్యార్థులకు మంగళవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. జగనన్న డిజిటల్ విద్య కార్యక్రమంలో భాగంగా 8వ తరగతి విద్యార్థులకు వీటిని అందించారు. హెచ్ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ మంచాల అరుణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

గోకవరం: విద్యాభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు అన్నారు. గోకవరంలో స్థానిక సంజీవయ్యనగర్‌లోని ఎంపీయూపీ పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు మంగళవారం ట్యాబ్‌ల పంపిణీ చేశారు. స్థానిక నాయకులు తోలేటి రాంప్రసాద్, బొడ్డపాటి వీరచంద్రం, బిజ్జి రాజు, మచ్చా మోహన్ తదితరులు పాల్గొన్నారు.